కాళేశ్వరమే జీవధార

- ఎత్తిపోతలతో నిరూపించిన కాంగ్రెస్
- పొన్నంది అవగాహనారాహిత్యం
- ఎల్లంపల్లి పూర్తి చేశామని మంత్రి చెప్పకోవడం విడ్డూరం
- బీఆర్ఎస్ హయాంలోనే ప్రాజెక్ట్ పూర్తి
- మాజీ మంత్రి హరీశ్‌రావు పంచ్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకు జీవధార అని, ఇది వృథా ప్రాజెక్టు కాదని కాంగ్రెస్ ప్రభుత్వమే నిరూపించిందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును తామే పూర్తి చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ గొప్పలు చెప్పకోవడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో వివక్షకు గురై, పెండింగ్ ప్రాజెక్టుగా మిగిలిన ఎల్లంపల్లిని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఈ మేరకు ఆదివారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఎఫ్ఆర్ఎల్ 148 మీటర్ల వరకు భూసేకరణ కాలేదు. పునరావాస కాలనీలు పూర్తి చేయకపోవడంతో ముంపుగ్రామాల తరలింపు జరగలేదు. కరీంనగర్-మంచిర్యాల రాజీవ్ రహదారిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించలేదు. 144 మీటర్లకు నీరు చేరితే పాత లోలెవెల్ బ్రిడ్జి మునిగిపోయేది. రాకపోకలు బంద్ అయ్యేవి. మీ హయాంలో ఎల్లంపల్లి బరాజ్ పూర్తి అయినా పై కారణాలతో పూర్తిస్థాయిలో నీరు నింపలేక నిరుపయోగంగా ఉండిపోయింది. తెలంగాణ వచ్చాకే పునరావాస కాలనీల నిర్మాణం పూర్తి చేసి, ముంపు బాధితులకు నష్టపరిహారం చెల్లించి, ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కాలనీలకు తరలించి, రాజీవ్ రహదారిపై వేగంగా హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ఎల్లంపల్లి జలాశయంలో ఎఫ్ఆర్ఎల్ 148 మీటర్ల వరకు 20 టీఎంసీల నీటిని నింపినం. ఇందు కు 2,052 కోట్లు వెచ్చించినం. బరాజ్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి నం' అని హరీశ్‌రావు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎల్లంపల్లి ప్రాజెక్టును ఒక కీలకమైన 'బ్యాలెన్సింగ్ రిజర్వాయర్'గా మార్చాకే జలాశయం మీద ఆధారపడిన అన్ని ప్రాంతాలకు నీటిని అందించే పని ప్రారంభమైందని తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోసింది గోదారి నీళ్లే!

అంబేద్కర్ పేరు మీద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రూపకల్పన చేసిన ప్రాజెక్ట్‌లో భాగమైన ఎల్లంపల్లి, నంది మేడారం, మిడ్‌మానేరు, అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లు ఉన్నాయని మంత్రి పొన్నం నిజాయితీగా ఒప్పుకున్నందుకు సంతోషమని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ప్రాజెక్టును రీ ఇంజినీరింగ్ చేసినప్పుడు ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మసాగర్ దాకా అలైన్‌మెంట్ మార్చలేదని, సీడబ్ల్యూసీ సలహాల మేరకు ఈ జలాశయాల నిల్వ సామర్థ్యాన్ని పెంచామని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ప్రతిపాదించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో మొత్తం జలాశయాల నిల్వ సామర్థ్యం 14 టీఎంసీలేనని, రీ ఇంజినీరింగ్ తర్వాత 141 టీఎంసీలకు పెరిగిందని స్పష్టంచేశారు. ఆ పెరిగిన టీఎంసీలతోనే జలాశయాల్లో ఈ రోజు నీటిని నింపగలిగారని, అవి ఎల్లంపల్లి నుంచి లిఫ్ట్ చేసినా కూడా మీరు వినియోగించింది కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మాణమైన సదుపాయాలనే కదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రక్రియ అర్థమైతే పొన్నం ప్రభాకర్ ఇవి కాళేశ్వరం నీళ్లు కావని అనేవారు కాదని తెలిపారు. 'శ్రీరాంసాగర్ వద్ద వరద ఉంటే, నీటి లభ్యత ఉంటే, కాళేశ్వరం ప్రాజెక్టులో లింక్-1, లింక్-2లో పంపులు నడపరు. శ్రీరాంసాగర్ వద్ద నీరు లేకపోతే, ఎల్లంపల్లి వద్ద నీటి లభ్యత ఉన్నట్టయితే లింక్-1లో పంపులు నడపరు. లింక్-2 నుంచే ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు, అక్కడినుంచి లింక్-4లో ఉన్న పంపుల ద్వారా అ న్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌కు నీటిని లిఫ్ట్ చే స్తారు. ఈ రెండు చోట్ల నీరు లేని కాలంలోనే లింక్-1లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లికి, అక్కడినుంచి లింక్-2 లో పం పింగ్ ద్వారా మిడ్ మానేరుకు, అక్కడినుంచి లింక్-4లో పంపింగ్ ద్వారా ఎగువన ఉన్న 4 జలాశయాలకు, శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకం ద్వారా శ్రీరాంసాగర్‌కు, మల్లన్నసాగర్ నుంచి నిజాంసాగర్‌కు, బస్వాపూర్‌కు పంప్ చేస్తారు. ఇదీ కాళేశ్వరం ప్రాజెక్టులో ఉన్న వెసులుబాటు' అని హరీశ్‌రావు వివరించారు.

> ఎల్లంపల్లి అప్పుడు ప్రాణహిత-చేవెళ్లలో భాగంగా ఉండేది. రీ ఇంజినీరింగ్ తర్వాత కాళేశ్వరంలో భాగమైంది. అవి కాళేశ్వరంలో భాగం అయిన ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోసిన నీళ్లే అయినా కాళేశ్వరం వ్యవస్థ ద్వారా చేరిన గోదావరి నీళ్లే కదా. - హరీశ్‌రావు

కాళేశ్వరం ఉపయోగం ప్రజలకు తెలుసు

'ఈ ఏడు శ్రీరాంసాగర్, ఎల్లంపల్లిల వద్ద నీటి లభ్యత ఉన్న కారణంగా ఎల్లంపల్లి నుంచే నీటిని పంపింగ్ చేశారు. ప్రకృతి అన్ని సీజన్లలో ఈ రకంగా సహకరించే అవకాశం లేదు. ముఖ్యంగా వేసవి సీజన్‌లో నీటిని మేడిగడ్డ వద్ద నుంచే లిఫ్ట్ చేయాల్సి ఉంటుంది. కాళేశ్వరం ప్రాజెక్టును ఒక సమగ్ర గోదావరి వ్యాలీ అభివృద్ధి ప్రాజెక్టుగానే చూడాలి తప్ప విడివిడి ప్రాజెక్టులుగా చూడటం అనేది అవగాహనా రాహిత్యం' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

> నాలుగేండ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థ ద్వారా సుమారు 20,33,572 ఎకరాలకు (కొత్త + స్థిరీకరణ) సాగునీరు అందిందని మంత్రి ఉత్తమ్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఇది అబద్ధమైతే, ఆ అబద్ధాలు చెప్పి శాసనసభ్యులను తప్పుదోవ పట్టించినందుకు ఆయన మీద ప్రివిలేజ్ మోషన్ పెట్టాల్సి వస్తుంది. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ వివరణ ఇవ్వాలి. - హరీశ్‌రావు

సాగులోకి వచ్చిన కొత్త ఆయకట్టు 98,570 ఎకరాలు

- 'కాళేశ్వరం కాలువల ద్వారా 456 చెరువులను నింపగా, వాటి కింద 39,146 ఎకరాలు సాగులోకి వచ్చాయి.
- శ్రీరాంసాగర్ (స్టేజ్-1, 2), నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలోని 2,143 చెరువులను నింపడం ద్వారా కొత్తగా 1,67,050 ఎకరాలు సాగులోకి వచ్చాయి.
- శ్రీరాంసాగర్, లోయర్ మానేరు, నిజాంసాగర్ ప్రాజెక్టుల ఆయకట్టుకు కీలక సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తడులకు నీటి సరఫరా అయింది. దీనితో ఈ ప్రాజెక్టుల కింద వానకాలం, యాసంగిలో 17,08,230 ఎకరాలు స్థిరీకరణకు నోచుకున్నాయి. ఈ స్థిరీకరణ 2020 నుంచి 2023 వరకు జరిగింది. స్థిరీకరణ కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక కాంపొనెంట్.
- లింక్-4 ద్వారా ఎత్తిపోసిన నీళ్లను కూడేల్లివాగు, హల్దీవాగుల ద్వారా 66 చెక్‌డ్యాంలను నింపడం వల్ల 20,576 ఎకరాలకు రెండు పంటలకు నికరంగా సాగునీరు అందింది' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, టీ రాజయ్య, బాల్క సుమన్, హరిప్రియానాయక్, వాసుదేవరెడ్డి, దుర్గం చిన్నయ్య

రాజీనామాకు రెడీ

మొదటిపేజీ తరువాయి...

మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. 'నిన్న ఒక మంత్రి తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిల్డప్ ఇచ్చారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇద్దరం కలిసి హైకోర్టు సీజే దగ్గరకి పోదాం.. వెంటనే సిట్టింగ్ జడ్జితోని ఎంక్వయిరీ చేయిద్దాం. సిట్టింగ్ జడ్జి గనుక ఇందులో తప్పులు ఏం జరగలేదు అంటే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా. హైకోర్టు సీజే దగ్గరికి రావడానికి మంత్రిగారికి ఇబ్బంది ఉందంటే డేట్, టైం ఫిక్స్ చేయండి ఇద్దరం కలిసి కేంద్రంలో ఉండే సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ దగ్గరికి పోదాం. మంత్రిగారికి, ముఖ్యమంత్రికి ఒకటే చెప్తున్నా.. ఇప్పటికైనా టెండర్లు రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న ఫైల్స్‌తో పాటు ఇప్పటి టెండర్ల వ్యవహారం వివరాలు సీవీసీ లేదా రిటైర్డ్ జడ్జి ఎదుట ఉంచుదామని, న్యాయంగా తీర్పు చెప్పిన తర్వాత తాను చెప్పింది అబద్ధమంటే రాజీనామా కాదు రాజకీయ సన్యాసం చేస్తానని స్పష్టంచేశారు. పొంగులేటి గతంలో కాంట్రాక్టర్‌గా ఉంటే ఉండొచ్చు కానీ ఈ రోజు మంత్రిగా ఉండి కాంట్రాక్టులు సంపాదించడం ముమ్మాటికి చట్టవ్యతిరేకమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ టెండర్ల వ్యవహారంలో అవినీతి జరిగిందని సీఎంతో పాటు మంత్రి పొంగులేటికి కూడా తెలుసని పేర్కొన్నారు. కేవలం రెండు కోట్ల లాభం ఉన్న బామ్మర్ది కంపెనీకి రూ.1000 కోట్ల కాంట్రాక్టు ఇచ్చి అవినీతి జరగడం లేదంటే ఎవరైనా నమ్ముతారా? అని ప్రశ్నించారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్‌తోపాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లను కూడా తాను ప్రస్తావించిన నేపథ్యంలో మంత్రి పొంగులేటి ఆగమేఘాలమీద ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించారని తెలిపారు. ముఖ్యమంత్రి భార్యకి సూదిని సృజన్‌రెడ్డి బంధువు కాదు, ఆమెకు స్వయానా సోదరుడని, భార్య తమ్ముడు బావమరిది కాకుండా ఇంకేమి అవుతాడో పొంగులేటి చెప్పాలని నిలదీశారు. ఒక్క రూపాయి అవినీతి జరిగినా, రూ. 8,888 కోట్ల అవినీతి జరిగినా ఈ చట్టం వర్తిస్తుందనే విషయం ఆయన తెలుసుకోవాలని సూచించారు. ఇప్పటికైనా జరిగిన తప్పును సీఎం ఒప్పుకొని జరిగిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని సూచించారు. పొంగులేటి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే రాజీనామా చేయాల్సి వస్తుందని చెప్పారు. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని, ఈ బరితెగింపు మాటలు మానివేయాలని సూచించారు. లేకుంటే గతంలో అశోక్ చౌహాన్, యడ్యూరప్ప, సోనియాగాంధీ పదవులు పోయినట్టు మీ పదవులు కూడా పోతాయని హెచ్చరించారు.

> ముఖ్యమంత్రి భార్యకు సూదిని సృజన్‌రెడ్డి బంధువు కాదు, ఆమెకు స్వయానా సోదరుడు. భార్య తమ్ముడు బావమరిది కాకుంటే ఇంకేమి అవుతాడో పొంగులేటి చెప్పాలి. ఒక్క రూపాయి అవినీతి జరిగినా, రూ. 8,888 కోట్ల అవినీతి జరిగినా ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్‌తోపాటు అవినీతి నిరోధక చట్టం వర్తిస్తుంది. - కేటీఆర్

> రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి అవినీతిపైనా మా దగ్గర సమాచారం ఉంది.. హైదరాబాద్‌కు దక్షిణాన నిర్మిస్తున్నది ఫోర్త్‌సిటీ కాదని, అది 'ఫోర్‌బ్రదర్స్' సిటీ. - కేటీఆర్

ఢిల్లీకి కప్పం కట్టేందుకు అవినీతి

ఢిల్లీకి కప్పం కట్టేందుకు ఈ భారీ అవినీతికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెరతీసిందని కేటీఆర్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రి సోదరుడు అనుముల జగదీశ్‌రెడ్డి వెయ్యి కోట్లు పెట్టే స్థాయికి, రేవంత్‌రెడ్డి బావమరిది సూదిని సృజన్‌రెడ్డి రూ.2 కోట్ల నుంచి రూ.1000 కోట్ల పెట్టుబడి పెట్టే స్థాయికి ఎలా వెళ్లారనే విషయాన్ని రేవంత్‌రెడ్డి చెప్పాలని నిలదీశారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి అవినీతిపైనా తమ దగ్గర సమాచారం ఉన్నదని తెలిపారు. హైదరాబాద్‌కు దక్షిణాన నిర్మిస్తున్నది ఫోర్త్‌సిటీ కాదని, అది 'ఫోర్‌బ్రదర్స్' సిటీ అని ఆరోపించారు. న్యాయస్థానాలను కూడా ఈ ప్రభుత్వం తప్పు దోవ పట్టిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫార్మాసిటీ రద్దు చేస్తున్నట్టు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు సీఎం కూడా చెప్పారని గుర్తుచేశారు. కానీ, న్యాయస్థానాల్లో మాత్రం అసత్య సమాచారంతో కూడిన పత్రాలను సమర్పిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకొని, కోర్టుల్లో మాత్రం పార్టీలో చేర్చుకోలేదని చెప్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధుల వ్యవహారాలకు సంబంధించిన ఈ అంశంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్ మొదలుకొని ఎనిమిది మందిలో ఒక్క బీజేపీ ఎంపీ కూడా ఎందుకు మాట్లాడటం లేదని కేటీఆర్ నిలదీశారు.

చీకటి సూరీళ్లకు రేవంత్‌సర్కార్ వెన్నుపోటు

సింగరేణి కార్మికులైన చీకటి సూరీళ్లకు రేవంత్‌రెడ్డి సర్కార్ వెన్నుపోటు పొడుస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి లాభాల్లో 16 శాతం మాత్రమే కార్మికులకు పంచుతూ 33 శాతం వాటా ఇస్తున్నట్టు మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'సింగరేణి నికర లాభాలు రూ.4,701 కోట్లు అయితే.. 33 శాతం వాటా అంటే కార్మికులకు రూ.1,551 కోట్లు బోనస్ ఇవ్వాలి. అంటే ఒక్కో కార్మికుడికి రూ.3.70 లక్షలు రావాలి. కానీ, కార్మికులకు ప్రకటించింది కేవలం రూ.796 కోట్లే. ఈ లెక్కన ఒక్కో కార్మికుడికి 16.9 శాతం మాత్రమే. కార్మికులకు హక్కుగా రావాల్సిన మిగతా వాటా రూ.754 కోట్లు ఎటు వెళ్లాయి. ఆల్‌టైం రికార్డు ఉత్పత్తిని సాధించినా అందుకు తగ్గ ఫలితం కార్మికుల దక్కడం లేదు. కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్న కాంగ్రెస్ సర్కారు నిజాలు చెప్పాలి. సింగరేణి లాభాల్లో 16 శాతమే ఇస్తున్నామని కాంగ్రెస్ సర్కారు ఒప్పుకోవాలి' అని డిమాండ్ చేశారు. కోల్‌బెల్ట్ మొత్తం కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే కార్మికులకు ఇచ్చే గౌరవం ఇదా? అని నిలదీశారు. కాంగ్రెస్ కుట్రపూరిత వైఖరిపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీతోపాటు సీపీఐ కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడకపోతే సింగరేణిని ప్రైవేటుపరం చేస్తారని చెప్పారు.

బీఆర్ఎస్ హయాంలో 32 శాతం పంచాం

బీఆర్ఎస్ పాలనలో సింగరేణి అద్భుత ప్రగతి సాధించిందని కేటీఆర్ గుర్తుచేశారు. సింగరేణి లాభాలు గణనీయంగా పెరగడంతో అందుకు అనుగుణంగా కార్మికుల వాటా పెంచుకుంటూ వచ్చామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పది పైసల వాటా మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ పాలన ఉన్న ఐదేండ్లలో 10 పైసల వాటానే ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో 11 పైసల నుంచి 20 పైసల వరకు మాత్రమే ఇచ్చారని చెప్పారు. 1999 నుంచి 2014 వరకు రూ.376 కోట్లు మాత్రమే సింగరేణి కార్మికులకు ఇచ్చారని, కాంగ్రెస్ పాలనలో లాభాలు ఎన్నడూ రూ.400 కోట్లు దాటలేదని చెప్పారు. లాభాలను వెయ్యి కోట్లు దాటించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో తాము రూ.2,780 కోట్లు కార్మికులకు పంచామని పేర్కొన్నారు. 2022-23లో కార్మికులకు సంస్థ లాభాల్లో ఏకంగా 32 శాతం వాటాను ప్రకటించి కార్మికుల కష్టానికి గుర్తింపు, గౌరవాన్ని కేసీఆర్ ఇచ్చారని వివరించారు. సగటున ఒక్కో కార్మికుడికి రూ.1.60 లక్షలు చెల్లించామని గుర్తుచేశారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, హరిప్రియా నాయక్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, తాటికొండ రాజయ్య, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు.

> ఆల్ టైం రికార్డు ఉత్పత్తిని సాధించినా అందుకు తగ్గ ఫలితం సింగరేణి కార్మికుల దక్కడం లేదు. వారి కష్టాన్ని దోచుకుంటున్న కాంగ్రెస్ సర్కారు నిజాలు చెప్పాలి. సింగరేణి లాభాల్లో 16 శాతమే ఇస్తున్నామని కాంగ్రెస్ సర్కారు ఒప్పుకోవాలి. కోల్‌బెల్ట్ మొత్తం కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే కార్మికులకు ఇచ్చే గౌరవం ఇదేనా? - కేటీఆర్

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

ఇటీవల భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధి కూచిపూడి, తొగర్రాయి గ్రామాల్లోని బాధితులకు స్వీరోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సాయం చేశారు. 250 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.7 వేల విలువ గల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. - కోదాడ రూరల్



వెంకటయ్య, నర్సయ్య (ఫైల్)

తమ్ముని మృతితో ఆగిన అన్న శ్వాస

వెల్గటూర్, సెప్టెంబర్ 22 : తమ్ముని మృతిని తట్టుకోలేక ఓ అన్న శ్వాస ఆగిపోయింది. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం పాత గూడూరుకు చెందిన రెడ్డిమల్ల నరసయ్య(75) గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్నాడు. ఆ తర్వాత అతని ఆరోగ్యం మరింత క్షీణించగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. శనివారం దహన సంస్కారాలు పూర్తి చేసి కుటుంబసభ్యులు ఇంటికి చేరారు. తమ్ముడి మరణంతో కలత చెందిన అతని అన్న వెంకటయ్య (78) మనోవేదనతో మృతిచెందాడు.

బీసీలు పోరాడితేనే వాటా

- ఐకమత్యంతో సాధించుకోవాలి
- తెలంగాణ తొలి స్పీకర్ మధుసూదనాచారి



విశ్వకర్మ సభలో మాట్లాడుతున్న మధుసూదనాచారి. చిత్రంలో జూలూరు తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ)/రామంతాపూర్: ఐకమత్యంతో పోరాడి బీసీలు రాజకీయాల్లో తమ వాటాను సాధించుకోవాలని తెలంగాణ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. తెలంగాణలో బీసీ చైతన్యం మొదలైందని, బీసీలంతా సంఘటితమవుతున్నారని చెప్పారు. హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లోని విశ్వకర్మ ఆత్మగౌరవ భవన ప్రాంగణంలో ఆదివారం జరిగిన విశ్వకర్మల భారీ బహిరంగసభలో ఆయన మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం విశ్వకర్మల కోసం ఐదెకరాల స్థలాన్ని కేటాయించిందని, విశ్వకర్మల కోసం అనేక పథకాలను తెచ్చిందని తెలిపారు. బీసీ వర్గాల నుంచి వచ్చిన తనను తొలి స్పీకర్‌గా చేసి తెలంగాణ చరిత్రలో చెరిగిపోని స్థానాన్ని కల్పించారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆర్థిక రాజకీయ సామాజిక రంగాల్లో బీసీలు తమ వాటాను సాధించుకునే దాకా ఉద్యమించక తప్పదని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ సూచించారు. అనంతరం విశ్వకర్మ భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ సభలో ఎంపీ ఈటల రాజేందర్, హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి, పద్మశ్రీ అవార్డు గ్రహీత వేలు ఆనందాచారి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర, బీజేపీ నాయకుడు ఆచారి, విశ్వకర్మ ఆత్మగౌరవ భవన ట్రస్ట్ చైర్మన్ లాల్కోట వెంకటాచారి, సెక్రటరీ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సింగరేణివ్యాప్తంగా ఆందోళనలు

- కాంగ్రెస్ మోసాన్ని ఎండగడతాం
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, సెప్టెంబర్ 22: సింగరేణి కార్మికులకు లాభాల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోసానికి వ్యతిరేకంగా దశలవారీగా పోరాటాలు చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 23న కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని, 24న రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం, 25న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామని వివరించారు. 26న కార్మికుల సంతకాల సేకరణతో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు పంపిస్తారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోతే హైదరాబాద్ సింగరేణి భవన్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నేత వాసిరెడ్డి సీతారామయ్య ఇతరులను నిందించే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని రాజిరెడ్డి హితవుపలికారు.

'సెల్ఫీ ఫర్ రుణమాఫీ'

- రుణమాఫీపై వినూత్న ఉద్యమం
- రుణమాఫీ కాలేదని సీఎంవోకు వీడియోలు
- సిద్దిపేట జిల్లా ధర్మారం రైతుల నిరసన

మిరుదొడ్డి, సెప్టెంబర్ 22 : రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత సగం మంది రైతులకు కూడా కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్ సర్కారుకు బుద్ధిరావాలని సిద్దిపేట జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన రైతులు 'సెల్ఫీ ఫర్ రుణమాఫీ' వీడియో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం గ్రామంలో రైతులు ఒక్కచోట చేరి 'సెల్ఫీ ఫర్ రుణమాఫీ' వీడియోలు తీసి ట్విట్టర్, ఫేస్‌బుక్ తదితర మాధ్యమాల ద్వారా సీఎంవోకు పంపే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 'రుణమాఫీ చేశామని జబ్బలు చరుచుకున్న సీఎం రేవంత్ రెడ్డి, నీకు రైతులు గట్టి జవాబు చెబుతూ సెల్ఫీ వీడియోలు తీసి పంపారని' అన్నారు. ఒక్క ధర్మారంలోనే రుణమాఫీ కాని 400 మంది రైతులు మానసికంగా ఇబ్బందులు పడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సెల్ఫీ వీడియోలు తీసి పంపినట్టు తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ చేశామని మీడియాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు గొప్పలు చెప్పుకోవడం తప్పితే సగం మంది కూడా రైతులకు రుణమాఫీ కాలేదని అన్నారు. ఈనెల 18న రుణమాఫీ కాని రైతులు మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెయ్యి మంది వరకు వచ్చి ధర్నా చేస్తే, బీఆర్ఎస్ నాయకులు వారికి డబ్బు ఇచ్చి తీసుకొచ్చి ఆందోళన చేయించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు వీడియోల ద్వారా డిజిటల్ ర్యాగింగ్ చేస్తారని హెచ్చరించారు. మిరుదొడ్డి మండల వ్యాప్తంగా 1500 మంది రైతుల నుంచి డిజిటల్ వీడియోలు సీఎంవోకు వెళ్లడం ఖాయమని అన్నారు. నిరసనలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, మాజీ సర్పంచ్‌లు తుమ్మల బాల్‌రాజు, జోగ్గారి బాల్‌నర్సయ్య, నాయకులు సూకురి లింగం, తీపిరెడ్డి దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మైసయ్య, పర్శరాములు, నారాయణ, మల్లేశం గౌడ్, భిక్షపతి, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇదే అతి తక్కువ బోనస్

- సింగరేణి కార్మికులను మోసగించిన కాంగ్రెస్
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్
- నికర లాభాల్లో 33% చెల్లించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి కార్మికులకు ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బోనస్ అతి తక్కువదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఒక ప్రకటనలో విమర్శించారు. కేవలం 16.9 శాతం బోనస్ ప్రకటించిన ప్రభుత్వం.. కార్మికులకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. సింగరేణి కార్మికులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సింగరేణి లాభాల్లో 50 శాతం కోత విధించి కార్మికులను మోసం చేసిందని మండిపడ్డారు. సింగరేణి కార్మికుల కష్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బొగ్గుపాలు చేశారని, నికర లాభాల్లో 33 శాతం బోనస్ చెల్లించి రేవంత్‌రెడ్డి సర్కార్ తన మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు.

రామగుండం ప్లాంట్‌లో సింగరేణి భాగస్వామ్యం వద్దు

- తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన